

సింధీ (పాకిస్థానీ) కథ

-అమర జలీల్

# పక్షి

**అనువాదం : కొండా కోటిరెడ్డి**

“మన కాంపౌండులోని వేపచెట్టు మీదొక ప్రమాదకరమైన పక్షి కూర్చుంది” అంది అమ్మ నన్ను అర్ధరాత్రి నిద్రలేపి.

“ఏదో గుడ్లగూబై వుంటుందిలే ఇహ నువ్వు పడుకో” అన్నాను ఆమెవైపు తిరుగుతూ.

“అది గుడ్లగూబ కాదు” వత్తిపలికిందామె.

“గుడ్లగూబ కాకపోతే, దాని చుట్టమై వుండాలి”

ఆమె లేపినప్పుడు గాఢనిద్రలో వుండటం వల్ల రెప్పపడిపోకుండా నిలపటం కష్టమైంది. “పడుకోనీ అమ్మా” గొణిగాను.

ఆమె నన్ను గట్టిగా ఊపుతూ అంది.

“బైట వేపచెట్టుమీద ఏదో ప్రమాదకరమైన పక్షి కూర్చుని వుంటే, నిన్నెట్లా నిద్రపోనిస్తాను? ”

నేను జీవితంలో మొదటిసారిగా, ఎన్నో పెద్ద పెద్ద ప్రయత్నాల తర్వాత పాప్యులేషన్ ప్లానింగ్ డిపార్టుమెంటులో ఆఫీసరు వుద్యోగం సంపాదించాను. మా డిపార్టుమెంటు అసలు పేరు ఫామిలీ ప్లానింగ్ డిపార్టుమెంటు. కొత్తగా సంపాదించిన స్టేటస్సు కోసం నేను రోమియో జూలియట్ లగ్జరీ టాల్కమ్ పౌడరు కొన్నాను. రోజూ వంటినిండా పౌడరు కొట్టుకుని, ఇళ్ళకొచ్చే అందమైన లేడి హెల్త్‌విజిటర్‌లను కలగంటూ నిద్రలోకి జారతాను.

అమ్మ నన్ను నిద్రలేపినప్పుడు, కలలో

వున్నాను. అందులో నేను ఫ్లూటుమీద జానపదగీతం పాడుతున్నా. ఓ అందమైన లేడీ హెల్తు విజిటరు తన పైఅధికారితో రాసక్రీడలాడుతోంది. హఠాత్తుగా అమ్మ ఆ కల చెడగొట్టేసరికి కోపమొచ్చింది. ఎంత కొడుకైతే మాత్రం, ఎన్నో సిఫార్సుల తర్వాత సింధీ ఆఫీసరైన మనిషిని నిద్ర నుండి లేపటం ఎంత తప్పో ఆమెకు స్పష్టంగా చెప్పి కోప్పడదామని నాకనిపించింది. కానీ నా ఆలోచనల్ని బైట పెట్టలేదు. మళ్ళీ నిద్రలోకెళదామని తయారయ్యా. అది చూసి అమ్మ నా భుజంమీద చెయ్యేసి గయ్‌మంది, "నువ్వేం మనిషివి? బైట వేపచెట్టుమీదొక భయంకరమైన పక్షి వుందని చెప్పినా వినిపించుకోకుండా నిద్రపోవాలని చూస్తున్నావు!"

"అబ్బ! పోనీయ్యవే అమ్మా.. అనవసరంగా విసిగిస్తున్నావు" అన్నాను. తర్వాత "అదొక గుడ్లగూబై వుంటుంది లేదా గబ్బిలమైవుంటుంది. కాకుంటే మరో పక్షి. అదీ కాకపోతే పక్షివేషం వేసిన ఖలీఫా హరూన్-వుల్-రషీద్ అయివుండొచ్చు"

"కాదు, కాదు.. అది గుడ్లగూబా కాదు, గబ్బిలాయి కాదు. భయంకరమైన పక్షి" అందామె నొక్కిపలుకుతూ.

"అదిగానీ ఒంటికాలిమీద లేదుగదా? " ఆమె ఆలోచన మరల్చుదామని ప్రయత్నించాను.

"లేదు"

"మాట్లాడుతోందా? "

"ఊహూ.."

"అయితే ఫరవాలేదు. వేపచెట్టుమీద కూర్చున్న పక్షి భయంకరమైంది కానేకాదు" ఆమె మనస్సుకు నిశ్చింత కలిగిస్తున్నాననుకుంటూ నేను చెప్పాను.

అయినా అమ్మ కళ్లు బాగా తెరుచుకునే కూర్చుంది. ఆమె కిటికీ దగ్గరికెళ్లి కాంపౌండ్‌లో ఉన్న వేపచెట్టునే చూస్తూ నిలబడింది.

"కాంపౌండ్‌లో లైట్ తీసేస్తే బాగుంటుంది. ఎందుకంటే అప్పుడు కాంపౌండ్‌లో చీకటౌతుంది. చెట్టూ కనిపించదు. ఆ భయంకరమైన పక్షి కూర్చున్న చెట్టు కొమ్మా కనిపించదు" ఓ సలహా పడేశా.

"చీకట్లో కూడా నేనా పక్షిని చూసేశా. అది అక్కడే ఉన్నట్లు నాకనిపిస్తుంది" కిటికీ దగ్గరనుండి వెనక్కి తిరిగి నా దగ్గరకొస్తూ అందామె.

"లేనిపోనివి ఊహించుకుంటున్నావు" అన్నాను పైకి లేచి. "సరే ఇప్పుడీ భయంకరమైన పక్షిని ఏం చెయ్యమంటావ్? "

కొన్ని నిమిషాలపాటు మౌనంగా కన్నార్పకుండా చూస్తూ నా ఎదుట నిలబడిందామె. ఆ చూపు గగుర్పొడిచింది. ఏమేమో అనిపించింది. నేను కాలి కరిగిపోతున్నట్లు.

నా భయం దాచుకుంటూ "సరే, ఈ భయంకరమైన పక్షినేం చేయమంటారో చెప్పు" అన్నాను మళ్లీ.

ఆమె నుండి జవాబు లేదు.

హఠాత్తుగా నాకు ఒక అపరిచితమైన స్త్రీ ముందు నిలబడ్డట్టు అనిపించింది. ఆ చీకట్లో ఆ స్తబ్దతలో ఏదో వింతైన భయం నాలోకి జొరబడినట్లు అనిపించింది.

అప్పుడు వినిపించింది అమ్మ గొంతు-

"చంపేసెయ్ దాన్ని"

"ఏంటీ, పక్షిని చంపనా? " ఆమెను నోరు తెరుచుకు చూశాను.

"అవును. అడుగడుగునా నీ కడ్డం వచ్చింది ఈ పక్షే. ఇది నీకు చివరి ఛాన్స్. చెట్టుమీద కూర్చున్న దాన్ని వెంటనే చంపు" అందామె.

"నా మాటినమ్మా" అన్నాను ఆ మంత్రజాలంనుండి బయటపడేందుకు ప్రయత్నిస్తూ.

"ఈ తాతమ్మ కథల్ని, ఈ దెయ్యాల్ని, భూతాల్ని నేను నమ్మను" అన్నాను.

అమ్మ కోపంతో మొహం చిట్లించింది. రెప్పార్పకుండా నావంక చూస్తూ-

"పిచ్చివాడా.. ఇవి కాకమ్మ కబుర్లు కావు. ఇది నిజం. గతమనే చరిత్రలాగా, గట్టి డబ్బులాగా, భవిష్యత్తనే బంగారంలాగా ఇది నిఖార్సయిన నిజం" అంది.

"కానీ చరిత్రకి ఈ పక్షికి సంబంధం ఏమిటి? "

"నీకు నాకు ఉన్న సంబంధమే"

"ఒక్క ముక్కకూడా అర్థంకావడంలేదు. నేను పడుకోబోతున్నా" అన్నాను.

"ఆ పక్షి చూసినప్పుడల్లా, నువ్వు నిద్రలో ఉన్నావు. ఎదురుబొదురయ్యేందుకు ఇది ఆఖరి అవకాశం. నువ్వా పక్షిని చంపు లేదంటే అదే నిన్ను చంపుతుంది" అందామె చేతులు జోడించి.

ఆమె మాటలు వింటుంటే.. అర్థపర్థం లేకుండా తనలో తానే ఏదో మాట్లాడుకొంటున్నదేమోనని నాకాశ్చర్యం కలిగింది. ఎందుకంటే ఆమెకు ఎనభై ఏళ్లు, బుర్రకూడా సరిగా పని చేయటం లేదు.

"ఆ పక్షిని నువ్వు తప్పకుండా చంపాల్సిందే" ఆమె మళ్లీ మొదలుపెట్టింది. షెల్ఫు తలుపు తెరిచి జోడుగుళ్ల తుపాకీ బైటికి తీసి, లోడ్‌చేసి నా చేతుల్లో పెట్టింది. "వెళ్లు, వెళ్లి దాన్ని చంపెయ్" అని మళ్లీ అంది.

తుపాకీ పట్టుకుని ఆమె ముఖంలోకి చూస్తూ "ఆ పక్షిని చంపితే నా ఉద్యోగం ప్రమాదంలో పడదూ? నేనీ ఉద్యోగం ఎంతో కష్టంమీద ఎన్నో సిఫార్సులమీద సంపాదించానని తెలుసుగా!" అన్నాను.

అమ్మ కోపంతో మండిపడింది. వణికే చేతుల్తో ఆమె నా దగ్గర్నుండీ తుపాకీ లాక్కుని పీల గొంతుతో అరిచింది. "మునుపు నువ్వెప్పుడూ ఇంత పనికిమాలిన మూర్ఖుడిగా లేవు. నువ్వు నా కొడుకువని నాకు తెలుసు. కానీ నీ పిచ్చి వ్యవహారం నాకు అనుమానం కలిగిస్తోంది."

నా నిద్ర ఎగిరిపోయింది. నేను చెయ్యిగలిగిందల్లా వెర్రి మొహం వేసుకుని ఆమె మొహంలోకి చూడటమే!

అమ్మ కాంపౌండ్ వైపు బయలుదేరుతూ "సరే ఆ పక్షిని నేనే చంపేస్తా. ఇహ నువ్వు గాజులు తొడుక్కుని కూర్చో" అంది.

ఆమె కదం తొక్కుతూ గది బైటకెళ్ళి, కాంపౌండు మధ్యన నిలబడింది. నేనూ బైటకు పరిగెత్తి ఆమె వెనక నిలబడ్డాను.

తుపాకీని భుజానికి తాటించి, చెట్టుమీద పక్షి కూర్చున్న కొమ్మకు గురిపెట్టే పనిలో వుందామె. నేనూ ఆ దృశ్యం చూశా, ఆశ్చ ర్యమూ కలిగింది.

మా అమ్మ భయంకరమైన పక్షి అని ప్రకటించింది.. మరేదో కాదు, ఒక గోధుమ రంగు పావురాయి!

తుపాకీ గొట్టం పట్టిలాగుతూ, "అమ్మా, వేపచెట్టు కొమ్మమీద కూర్చున్న పక్షి.. శాంతికి చిహ్నమైన పావురాయి" అన్నాను ఆందోళనగా.

"అదే మనకు అతి ప్రమాదకరమైన పక్షి. మన బతుక్కు నిజమైన శత్రువు" అందామె నా చేతిని విసురుగా తోసేస్తూ.

"నేను దాన్ని చంపాలి"

ఆమె తుపాకీ ట్రిగర్ నొక్కేలోపలే స్విచ్చి నొక్కి లైటార్పేశాను.

కాంపౌండు.. చీకటిలో మునిగిపోయింది.

"అయ్యో, పిచ్చోడా.. ఏం పని చేశావ్?" అమ్మ అరిచింది.

ఎగిరిపోయే పక్షి రెక్కల టపటపలు విని పించాయి.

లైటు వేశాను. అమ్మ దుఃఖంతో, కోపంతో, బాధతో నిండిన గొంతుతో ఏడ్చింది.

"ఎంత పని చేశావ్. అయ్యో, ఎంతపని చే శావ్?"

ఆమెని ఓదార్చే ప్రయత్నం చేశాను.

"అమ్మా! ఇది కంటోన్మెంటు ప్రాంతం. తుపాకీ పేలుడికి ఆర్మీవాళ్లు మేలుకునే వాళ్ళు. నా వుద్యోగం పోయేది. ఎన్నో రిక మండేషన్ల తర్వాత కదా, ఇప్పుడు నేను ఆఫీ సర్ని అయ్యాను!" అన్నాను.

ఆమె తుపాకీ నుండి గుళ్ళు తీసి అవతల పారేసి తుపాకీ నా చేతికిచ్చింది.

"నాయనా, నేను నిన్ను శపించటం లేదు. కానీ, కొంతకాలం తర్వాత చేతులు- కాళ్ళు పోయి నువ్వు కుంటివాడివి, అంగవిహీను డివి అవుతావని నాకు భయం వేస్తోంది. అప్పుడు నువ్వు చేతికర్ర బదులు ఈ తుపాకీ ని ఆధారం చేసుకోవచ్చు" అంది.

నేను వేపచెట్టు కొమ్మకేసి చూస్తూ, ఆ పక్షి ఏ ప్రమాదమూ లేకుండా సురక్షితంగా ఎగి రిపోయిందని సంతోషపడ్డాను. V